# మమతల ముడి

"మనస్సుకి రెక్కలున్నాయి... అవేగానీ నా శరీరానికి వుంటేనా? యీపాటికి వచ్చి నీ సన్నిధిని వ్రాలక పోదునా, నిన్ను కళ్ళారా చూడాలని ఎంతగా కొట్టుకుపోతున్నానో, అంతగా నా పరిస్థితులు నన్ను పట్టి బంధించి వేస్తున్నాయి. ఇంతకీ భగవంతుడు నా మీద కాకపోయినా నీ మీదనైనా దయచూపించాడని నాకు సంతోషంగా వుంది. ఇన్నాళ్ళకు యింత చల్లని వార్త విన్నందుకు నా చెవులు ధన్యమైనాయి..."

విజయ వ్రాసిన ఉత్తరం యింకా చాలా పెద్దది. అదంతా చదువుతోంటే నర్మద ముఖం ఎర్రగా అయిపోయింది. ఇద్దరికీ కూడా కావలసిన స్నేహితురాలు కామేశ్వరి క్రిందటివారం వచ్చి, నర్మదని చూసి వెళ్లింది. ఆమె యీ వార్త చేరవేసింది విజయకి.

"అమ్మో యింత మంచి కబురు ఎల్లా దాచుకున్నావే. ఎవరికీ చెప్పకుండా?" అంటూ నిలవేసేసరికి నర్మద నవ్వి, "పేపర్లో వేయించమంటావా?" అన్నది.

"వేయించినా తప్పులేదు. కానీ డబ్బు ఖర్చవుతుంది. బుజ్జిపాపాయి కోసం డబ్బు దాచాలి కదా అని వూరుకుంటున్నాను. నేను ఎల్లుండి బెజవాడ వెడుతున్నాను. విజయకి యీ కబురు చెప్పడానికి" అన్నది కామేశ్వరి.

"పోవోయి ఆర్భాటం, ప్రత్యేకం పనిగట్టుకుని వెడతావా? ఒక కార్డు ముక్కతో పోయేదానికి?" అన్నది నర్మద.

"నీకు - ఆ కార్డుముక్క కూడా ఎవరికీ వ్రాయాలని తోచలేదుగా? ఐనా యిల్లాంటి విషయాలు కార్డులమీద వ్రాస్తారుటే? నేను వెళ్లి విజయతో అన్నీ చెప్పాలి. నీ రంగు, నీ నిండు, నీ బరువు, నీ సిగ్గు... " కామేశ్వరి మాటలు ఎప్పుడూ అంతే.

"ఊరుకుంటావా లేదా?" అంటూ నర్మద లేవబోయింది. కానీ ఆమె దూకుడంతా మాటల్లోనే.

నర్మదకి పెళ్లయి ఏడు సంవత్సరాలైంది. ఇప్పటికి ఆమెకు సంతాన ప్రాప్తి సూచనలు కానవచ్చాయి. బి.ఏ.లో ముగ్గురు అమ్మాయిలూ క్లాసుమేట్సు. స్కూలు ఫైనలుపూర్తి కాగానే విజయకి పెళ్లయింది. మేనరికం తయారుగా వుండడం వల్ల బి.ఏ. లో చేరగానే కామేశ్వరికి, పరీక్షలు కాగానే నర్మదకి పెళ్లిళ్లు అయినాయి.

చిన్నతనంలోనే పెళ్లయినప్పటికీ విజయ పైకి చదువుకుంది. ఎం.ఏ. పాసై లెక్చరరుగా పనిచేస్తోంది. పి. హెచ్.డి. కూడా చేయాలని అనుకుంటోంది. తమని చేపట్టిన భర్తలు ఆధునిక భావాలు

కలవాళ్లని అనుకున్న నర్మద, తాము పొరబడ్డారు. చదువుకి స్వస్తి. ఉద్యోగం ప్రసక్తే నాస్తి. సంసారమే జీవిత సర్వస్వం అని వాదించి, వాదించే వరకు పరిస్థితి రాకుండానే – శాసించారు. బి.ఏ. మాత్రం చదివి పెద్ద జనరలు స్టోర్సు నడుపుకుంటున్న విజయ వాళ్లాయనే నయమనిపించాడు.

పెళ్లయి ఏడేళ్లు దాటినా కూడా విజయకి పిల్లలు లేరు. మొదట్లో "బాదరబందీ వద్దనుకున్నారేమిటి?" అని అడిగిన మిత్రులు కొన్నాళ్లకి, "ఏమిటి సంగతి, యిల్లా వూరుకున్నావేమిటి?" అని అంతరంగికంగా సలహాలిచ్చారు. ఆ స్థితి దాటి ఆమె మనస్సు నొచ్చుకుంటుందేమోనని, ఆమాటే అడగడం మానేశారు. అందుకు ఆమె చిన్ననాడు, "భగవంతుడనగా ఎవడు?" అని వేసిన ప్రశ్నలని మర్చిపోయి, 'నా మీద దయ చూపని దేముడు నీ మీదనైనా చూపాడు' అని వ్రాసింది నర్మదకి.

నర్మదని పెళ్లి చేసుకున్న శ్రీపతికి టూరింగు ఉద్యోగం మందుల కంపెనీలో. నెలకి యిరవై రోజులు భార్యని వదిలి వెళ్లలేక చాలా బాధపడేవాడు. కొన్నాళ్లు తల్లిని తెచ్చి యింట్లో పెట్టుకున్నాడు. ఆ తర్వాత నర్మదనే వాళ్ల అన్నగారింట్లో దించడం ప్రారంభించాడు. ఆమెకు ఐదు నెలలు నిండేవరకు ఒక మాదిరి ఆరాటం. ఆ తర్వాత మరోరకం ఆదుర్దా శ్రీపతికి. ప్రతిసారి కూడా ఆమెని వదిలి వెళ్లేటప్పుడు ఆశ్రమం నుంచి శకుంతలని పంపేటప్పుడు కణ్వుడు మొదలు పశుపక్ష్యాదుల వరకు అంతా కలిసి పొందినంత దుఃఖం పొందేవాడు.

ఇటువంటి టూరు సమయంలోనే విజయ వస్తున్నట్లు వుత్తరం వచ్చింది. కాలేజీకి సెలవులిచ్చారు. వస్తున్నాను. మీ ఆయన వుంటారా? అని వ్రాసింది విజయ. "నేనీసారి మా వాళ్లింటికి వెళ్ళను. విజయ నాకు సాయం వుంటుంది" అన్నది నర్మద. శ్రీపతికి అనుమానం. విజయ బాగా చూసుకోదేమోనని. ఆ మాట రెండుసార్లు అన్నాడు. నర్మదకి మనస్సులో గట్టిగా వుంది. స్నేహితురాలితో కలిసి సరదాగా గడపాలని. "పోనీ, మీ అమ్మని వచ్చి వుండమను నీ దగ్గర" అన్నాడు. నర్మద సరేనంది కానీ, చూద్దాంలే అనుకుంది మనస్సులో.

శ్రీపతి సాయంత్రం వెడతాడనగా ప్రొద్దున్న వచ్చింది విజయ. వస్తూనే నర్మదని కౌగిలించుకున్నంత పని చేసింది. ఎన్నో ప్రశ్నలడగాలనీ, ఎన్నో విధాల హాస్యాలాడాలని వున్న లోపలి కోరికని మనసులోనే అణచివేసింది. కానీ నర్మద ఎటు వెడితే అటు వెంటాడే చూపులలో ఆ చిలిపితనమంతా వ్యక్తమౌతూనే వుంది. క్రొత్త మనిషి రాక వల్ల శ్రీపతి కొంచెం యిబ్బంది పడినా, భార్య సంతోషం చూచి తనూ సర్దుకున్నాడు. జాగ్రత్తగా వుండమని ఎన్నో విధాల చెప్పాడతను భార్యకి. "నర్మద కొంచెం దుడుకుగా వుంటుందేమోనండీ. మీరుంటారుకదా. చూసుకోండి" అన్నాడు సిగ్గు విడిచి విజయతో. విజయ చాలా ధైర్యం మాటలు పలికింది. చివరికి అతను వెళ్లాడు సాయంత్రం రైలుకి.

భోజనాలు చేసి రాత్రి డాబామీద పడుకున్నప్పుడు ఎన్నో ప్రశ్నలడగాలనుకున్న విజయ, ఏమి మాట్లాడాలో తెలియక నక్షత్రాల కేసి చూస్తూ వుండిపోయింది. నర్మద కాలేజీ నాటి కబుర్లు ప్రారంభించింది. విజయ ముక్తసరిగా జవాబు చెబుతోంది. తను, నర్మద కలిసి చదువుకున్న రోజులన్నీ చాలా దూరంగా కనబడుతున్నాయి. ఒకటిగా కలిసి నడిచిన తామిద్దరూ చేతులు వదిలేసినట్లు, నర్మద హఠాత్తుగా దూరంగా పారిపోయినట్లు అనిపిస్తోంది. పెళ్లయినప్పటికీ, ఎంతో సన్నిహితంగా వున్నామనుకున్న యిద్దరూ యిప్పుడు నర్మదకి పట్టిన అదృష్టంతో దూరమై పోయారు. ఇదంతా కూడా ఆమె ముక్తసరి సమాధానాల్లో ధ్వనిస్తోంది.

నర్మద మాటలు ఆపి ఒక్కక్షణం నిశ్శబ్దంగా వుండి, తర్వాత "నిద్ర వస్తోందా విజయా?" అన్నది.

"అబ్బే, లేదు చెప్పు వింటున్నా!" అన్నది విజయ

నర్మద తన మంచం మీద నుంచి లేచి వెళ్లి విజయ మంచం ప్రక్కన పడక్కుర్చీలో కూర్చుంది. "ఏమిటో పరధ్యానంగా వున్నావు?" అన్నది.

"లేదే?" అన్నది విజయ నవ్వి.

"ఐతే మరే. నమ్మాను నీ మాట... ఈ వూళ్లో మా డాక్టర్ కమలేశ్వరి వున్నారు. ఆవిడ దగ్గరికి తీసుకెడతాను వస్తావా?" అన్నది నర్మద.

విజయ మాట్లాడలేదు. రాత్రి చల్లదనంలో కూడా ఆమె వంట్లో ఆవిర్లు వచ్చాయి.

"నాదగ్గర కూడా సిగ్గుపడతావా విజయా? వెడదాం. ఒకసారి రారాదూ?" అన్నది నర్మద.

"వద్దు. లాభం లేదని తేలిపోయింది. నన్ను వదిలేయి. సరేగానీ, నువ్వు హాయిగా వున్నావా లేదా? అది చెప్పు" అన్నది విజయ.

"హాయిగానే వున్నాను. కానీ కాస్త భయం వేస్తోంది" అన్నది నర్మద.

"భయం దేనికి? అని ధైర్యం చెప్పే అర్హత నాకు లేదు గానీ, నాకు ఎందుకో నిన్ను చూస్తే చాలా ప్రశాంతంగా వుంది. నీకు అంతా సుఖంగా జరుగుతుందనిపిస్తోంది" అన్నది విజయ. నర్మద మాట్లాడలేదు. శరీరం కొత్త స్థితిలో వుంది. సైన్సు పాఠాల్లో చదువుకున్న రక్తమాంసాల శరీరానికి కొత్త అర్థం వచ్చింది. ఇప్పుడు ప్రకృతిలో అత్యద్భుతమైన విషయం తనకే జరిగింది. అనంతమైనన్ని సంవత్సరాలుగా మనిషి మనిషికి అందిస్తున్న వారసత్వంలో ఆ గొలుసులో తనూ ఒక లంకెగా కలిసినట్లనిపిస్తోంది.

"ఇది చాలా క్రొత్త అనుభవం విజయా! ఏదో భరించలేనిదీ వీలులేని ఆపదగా అందరూ ఎందుకు అనుకుంటారో గానీ, ఎంతో విచిత్రమైంది, అపూర్వమైనది యీ అనుభవం" అన్నది నర్మద.

ఔనా? ఏమో! తనకి దేముడిచ్చిన జీవితంలో యీ అధ్యాయం లేదు. తనకి ఎప్పుడూ అందని అనుభవం అది. గొప్ప అరణ్యంలో నడిచి వెడుతున్నారు తనూ, నర్మద. తనని వదిలి పారిపోయిన నర్మదకి వసంత వనం కనబడింది. రంగురంగుల సువాసనల పూలు పూచిన చెట్లు ఆమెకి తారసిల్లాయి. అక్కడనుంచి ఆమె కేకవేస్తుంది. "ఇక్కడ పూలు ఎంత బాగున్నాయో చూడు" అని. కానీ తనకి యిన్నాళ్లుగా దాటి వచ్చిన ఎండు బెరడు చెట్లు, మొండి గుబుర్లే కనిపిస్తున్నాయి. ఇంకా దట్టమౌతోంది అరణ్యం.

విజయ నిశ్శబ్దంగా కళ్లల్లో నీరు పెట్టుకుంటోందని నర్మద గ్రహించింది. "ఊరుకో విజయా. యిదొక్కటేనా జీవితానికి ముఖ్యం? ఇంకెవరూ చేయలేని ఎన్నో పనులు నువ్వు చేస్తున్నావు. మరో విధంగా నీలోని శక్తి లోకానికి ఉపయోగపడుతుంది. మాబోటి వాళ్లము యిల్లాగే సామాన్యంగా అందరిలాగే సంసారంలో వుండిపోతాము" అన్నది. కొంచెం ఆగి చిలిపిగా "జనాభా సమస్యకి దోహదం చేయడం లేదని ప్రభుత్వం మెచ్చుతుంది నిన్ను" అన్నది.

విజయకి యీ మాటలు ఓదార్పుగా లేవు. కొంత సేపటికి తనే తమాయించుకుంది. "పనిగట్టుకుని వచ్చి, నిన్ను చూసి కళ్లలో నీరు పెట్టుకుంటున్నానని అనుకోకు నర్మదా! ఎంతో దగ్గర దానవు కనుక దాచుకోలేక పోయినాను. చెప్పవూ? నీ మనస్సు, నీ వళ్లు ఎలా అనిపిస్తున్నాయో చెప్పవూ?" అని విజయ ప్రక్కకి తిరిగి నర్మద చేయి తన చేతిలోకి తీసుకుంది.

***

"వచ్చారా? నర్మద నాలుగు సార్లు అడిగింది అప్పుడే" అన్నాడు శ్రీపతి విజయని చూడగానే తను హడావిడిగా సంతోషపడుతూ మాట్లాడాలా, లేకపోతే మర్యాదగా కంగ్రాచ్యులేషన్స్ అనాలా అనే ఆలోచనలో వుంది విజయ. అప్పటికి ఏదీ అనక, "పాప ఎవరి పోలిక?" అన్నది. అంతలా అంత పొడుగున్న శ్రీపతి ఒక్కసారి సిగ్గుపడి పోయి "ఏమో మరి. మీరు చూసి చెప్పాలి" అన్నాడు.

హాస్పిటల్లో చేరేటప్పుడే చెప్పింది నర్మద. వార్త తెలియగానే విజయకి ట్రంక్‌కాల్ చేసి చెప్పమని, పాపాయి పుట్టిందని. అల్లాగే చెప్పాడు శ్రీపతి. మధ్యాహ్నం రెండుగంటలకల్లా వచ్చేసింది విజయ. రాగానే

హాస్పిటల్లోకి వెళ్లడానికి సిద్ధమైంది. శ్రీపతి టాక్సీ తీసుకొచ్చాడు. నర్మద వాళ్లమ్మ అక్కడే వుంది. తన తల్లిని కూడా టాక్సీలో ఎక్కించుకుని బయలుదేరాడతను.

విజయకి గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. సంతోషం కాదు అది. పాపని చూడాలనే ఆత్రం కాదు. పరీక్షలో నెగ్గిన నర్మదని, పరీక్షకి కూర్చోవడానికైనా నోచుకోని తను చూడడం, అభినందించడం మనస్ఫూర్తిగా నేనా? ఔను. కల్మషంలేని మనస్సుతోనే.





రూములోకి వెళ్లగానే ముందు కనబడింది నర్మద. తనని చూడగానే నవ్వింది. “ఎల్లా వున్నావు? నేను చెప్పలేదూ నువ్వు బాగుంటావని?” అన్నది మంచం దగ్గరగా నిలబడి విజయ. ఆతర్వాత ఏమీ మాట్లాడకుండా అల్లాగే చూస్తూ వుండిపోయింది విజయ. నర్మద వచ్చిన వారందరి వంకా ఒకసారి చూచి, విజయ వంక చూసి కళ్లు మూసుకుంది. పాలిపోయినట్లుంది. ముఖం ఎంతో సున్నితంగా వుంది. కొంతసేపటికి కళ్లుతెరిచి “పాపని చూశావా?” అన్నది. విజయ “లేదు” అంటూ వెనక్కి తిరిగి ఉయ్యాల వేపు వెళ్లింది. గులాబీ పూవుని పడుకోబెట్టారు ఆ ఉయ్యాల్లో. కనురెప్పల వెంట్రుకల నుంచి చిటికిన వేలి గోటి వరకూ పొల్లుపోకుండా, పొరబాటు రాకుండా తయారైన ఆ అద్భుత సృష్టిని చూస్తోంటే – మనస్సు భారమైంది. తనకి అర్థం కానిదేదో, నర్మదకి అర్థమైనదేదో వుంది ఆ చిన్న ప్రాణిలో. ఎన్నడూ ఎవరిని చూచినప్పుడు కలగని ఆపేక్ష కడుపులో కలిగింది.

నర్మద నీరసంగా వుంది. మాట్లాడ్డం కానీ, చూడ్డం కానీ ఆమెకి యింకా అలసట కలిగిస్తున్నాయి. విజయ వెళ్లి ఆమె మంచం మీద కూర్చుంది. “చాలా బాధ పడ్డావా?” అనడిగింది మెల్లిగా. నర్మద కళ్లుతెరిచి నవ్వింది. “ఏమో!” అన్నది. అంతకు మించి మాట్లాడుకోలేదు ఆ మిత్రులు. నర్మద హాస్పిటలులో వున్నన్ని రోజులు విజయ తనూ అక్కడే వుంది. తొమ్మిదో రోజు యింటికి వచ్చారు. ఆ తర్వాత స్నానమైంది. చేతకాని చేతులతో ఎత్తుకుంటుంది పాపని విజయ.

స్నానమైన తర్వాత పచ్చగా, సింహాచలం సంపెంగలాగా వుంది పాపాయి. అంతకంటే పచ్చిగా, ‘పండుకాదు, చిలుకలార, పచ్చిబాలెంత’ అని పాటలో చెప్పినట్లు అందంగా మెరిసిపోతోంది నర్మద. క్రొత్త చొక్కా తొడిగిన పాపాయిని విజయ రెండు చేతులతోను ఎత్తుకుని ముద్దాడి, “ఈ పళంగా మీ అపరంజిని ఎత్తుకు పోతే ఏం చేస్తావు?” అన్నది.

“ఏం చేస్తాను? స్నేహితురాలికి కానుకగా యిచ్చాననుకుంటాను” అన్నది నర్మద.

“నిజంగానా?” అడిగింది విజయ. ఆమె కంఠం సీరియస్‌గా వుంది. మన స్నేహం నిజంగా అంత గొప్పదే సుమా అన్నట్లుచూస్తోంది.

“నిజంగానే – తీసుకెడితే యిప్పుడే తీసుకు వెళ్లు. ఆలస్యమైనకొద్దీ నాకూ మమకారం” అన్నది నర్మద. ఈ మాటలు ఎలా అన్నదో ఆమెకే తెలియదు.

“ఇప్పుడు లేదా నీకు మమకారం?” అన్నది విజయ.

నర్మద ఆలోచించింది. విజయ చేతుల్లో కళ్లుతెరుచుని ఎటో చూడబోతూ, ఎటూ చూడలేక, వేళ్లు నోట్లోకి సరిగా పోక సతమతమవుతున్న ఆ లేత ప్రాణం వంక చూసింది. మనస్సులోంచి ఉప్పొంగే ప్రేమ లేదూ? కానీ అంతకంటే ఎక్కువగా మెరిసే భావం ఒకటుంది.....

ఏమిటది? స్త్రీ జన్మమెత్తినందుకు ఒక సార్థకమైన పని చేశాను అనే దర్పం. స్త్రీగా తన ఉనికిని నిరూపించుకున్నానన్న గర్వం. ఒక గొప్పతనం సాధించానన్న సంతృప్తి. ఇవన్నీ మెరుస్తున్నాయి. ఆ కళ్లల్లో ఆ మెరుపు అంతా విజయకి అర్థమౌతోంది.

“నిజంగానే పెంచుకోవడానికి నాకిచ్చేస్తావా నర్మదా? మరి నీ సంగతో?” అన్నది విజయ.

నర్మద నవ్వింది గర్వంగా, అందంగా హాయిగా నవ్వింది. "మళ్లీ యింకోరు" అన్నది. ఏమి ధీమా?

వండుకున్న మల్లెపూలలాంటి అన్నాన్ని అన్నార్తులై వచ్చిన వారికి యిచ్చేసి, "నేను మళ్లీ వండుకుంటానులే!" అన్నట్లుగాను, కమ్మగా వ్రాసిన కావ్యానికి చిత్తు కాపీ కూడా లేకపోయినా ఎవరో ఆప్తులకి యిచ్చేసి, మళ్లా వ్రాసుకుంటాలే అన్నట్లుగాను ఉంది నర్మద యీ మాట.

'ఇంకొంచెం సేపు చూడనివ్వకు నా మల్లెల వేపు. గులాబీల గుత్తి వేపు. చూస్తే యివ్వను. నేనే వుంచుకుంటానంటాను' అన్నట్లుగా నర్మద.

"తీసుకెడితే యీవేళే తీసుకెళ్లు. ఆ తర్వాత వదలలేను" అన్నది.

"ఇచ్చేయడానికి సర్వహక్కులు నీవేనా?' అన్నట్లుగా "నిజంగానా?" అన్నది విజయ.

నర్మద యింక మాట్లాడలేదు. తన పతియైన శ్రీపతి, శ్రీపతి తల్లియైన తన అత్తగారు, ఆ వెనుకవున్న యావత్తు వంశం తాము కోటి పూవుల పూజలు చేస్తేనే యీ మహాలక్ష్మి యీ యింట్లో అవతరించిందని అనుకుంటున్నారు. అసలు తన కడుపులో ఒక బిడ్డ స్థానం కోసం వెతుక్కుంటూ రావడం, వచ్చి, నివసించి, తిరుగాడి, తన వూపిరే దాని ప్రాణంగా అన్ని రోజులు, అన్ని గంటలు, అన్ని నిమిషాలు బ్రతకడమే ఒక గొప్ప వరం. సృష్టిలోకల్లా అత్యద్భుతమైన యీ వరం ఎందరికో యివ్వబడినా, ఆ గొప్పతనాన్ని గుర్తించిన వారు ఎవరో ఒకరే. తన నరాలు, కండరాలు, మనోబలం కలిసి ఒక్కుమ్మడిన యీ బంగారు ముద్దని లోకంలోకి తీసుకొచ్చాయి. తాను చేసిన సాధన, తపస్సు ఫలించాయి. ఆ ఫలాన్ని అందుకోవటమే చాలు జీవితానికి తృప్తి.

"నిజం విజయా! నువ్వు ఏమీ లోటు చేయవు కదా నా బిడ్డకి?" అన్నది నర్మద.

మరి రెండు రోజులకి విజయ బయలు దేరి వెళ్లింది. వంటరిగానే. 'నర్మద అన్నవన్నీ వుత్తి మాటలేనా?' అనుకుంటే ఆ క్షణాన 'నాకు మళ్లీ ఒక బిడ్డ పుడుతుందిలే!" నేను పరీక్షలో నెగ్గి స్త్రీత్వం నిరూపించుకున్నానుగా అనే దర్పంలో. ఆమె నిజంగానే అన్నదా మాట. విద్యాధికురాలైన విజయకి యీ దర్పం చక్కగా అర్థమైంది. అందుకే పాపను యివ్వడంలో అసంగతం కనపడక, యిస్తానంటే నిజంగానే ఆశపడింది.

ఆమె వెర్రి కానీ, కథలలో వ్రాసుకుంటేను, పుస్తకాల్లో ప్రవేశపెట్టిన సిద్ధాంతాలుగా చదువుకుంటేనూ, హేతుబద్ధంగా కనబడే మానవుల మనోగతులు, జీవితంలో నిజమైపోతాయా? కావు కనుకనే ఆమె వుత్తి చేతులతో వెళ్లింది.

**స్వాతి**